
## భారాస నాయకుల

# అరెస్టు కలకలం



**దేవరుప్పుల -నవభూమి:** ఇద్దరు భారాస నాయకుల అరెస్టు జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో కలకలం రేపింది.వారికి అండగా పార్టీ నాయకులు దేవరుప్పుల భారాస మండల పార్టీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు తలపెట్టిన నిరసన ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ర్యాలీని తొలుత జఫర్‌గడ్ ఎస్సై రామ్‌చరణ్, పాలకుర్తి ఎస్సై సాయి ప్రసన్నకుమార్ అడ్డుకుని మాజీ మంత్రి దయాకర్‌రావును ఉన్నతాధికారులతో మాట్లాడించే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. అనంతరం ర్యాలీ ప్రదేశానికి వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య చేరుకుని సీపీ, డీసీపీతో చరవాణిలో మాట్లాడించారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించడానికి సోమవారం వరకు సమయం కావాలని సీపీ కోరడంతో కామారెడ్డిగూడెం శివారులో నిరసన ర్యాలీని విరమించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ భారాస నాయకుల అరెస్టు వెనుక కాంగ్రెస్ నేతల హస్తం ఉందని ఆరోపించారు. చిన్నమడూరు మాజీ సర్పంచి వంగ పద్మ కుమారుడు వంగ అర్జున్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సుజాత భర్త గౌడుగు మల్లికార్జున్‌లను ఓ వెంచర్ లావాదేవీల విషయంలో ఇతర భాగస్వాముల ద్వారా కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు నమోదు చేయించారన్నారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో స్టేషన్ బెయిల్ రాకుండా చేసి జైలుకు పంపించారన్నారు.. పోలీసులు ఇచ్చిన సోమవారం గడువుతో పాటు ఈ నెల 26 వరకు వేచి చూస్తామని, అరెస్టు చేసిన భారాస నాయకులను విడుదల చేసి, వెంచర్ యాజమానిని కిడ్నాప్ చేసి అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర నాయకులు కేటీఆర్, హరీష్‌రావుతో సహా జిల్లా నాయకులతో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం అక్రమాలకు పాల్పడడమే కాకుండా.. ఇటీవల వెంచర్ యాజమాని పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని ఎస్సై సృజన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.ఇద్దరు భారాస నాయకులకు 14 రోజుల రిమాండ్ అంతకు ముందు ఇద్దరు భారాస నాయకులను ఓ వెంచర్ యాజమానిని బెదిరించి వసూళ్లకు పాల్పడినట్లు నమోదైన కేసులో పోలీసులు అరెస్టు చేసి జనగామ కోర్టు ముందు హాజరుపర్చారు. వారికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలం చిన్నమడూరు మాజీ సర్పంచి వంగ పద్మ కుమారుడు వంగ అర్జున్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలి భర్త గౌడుగు మల్లికార్జున్.. రూ.9.25 లక్షల నగదును ఫోన్‌పే, అకౌంట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా తీసుకుని ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించినట్లు వెంచర్ యాజమాని ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆత్మస్థైర్యమే ఔషధం..
# మహమ్మారిపై విజయం








# నవభూమి వరంగల్

అనుబంధం

23 సెప్టెంబర్,2024 సోమవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in





# ఇంటర్‌లో ప్రవేశాలు అంతంతే




**జనగామ -నవభూమి:** ఇంటర్మీడియట్ ప్రవేశాలకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే పలుమార్లు ప్రవేశాల గడువు పెంచినా ఈ ఏడాది 50 శాతం సీట్లు పూర్తి కాలేదు.ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో అతి తక్కువగా ప్రవేశాలు నమోదు కావడంతో యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఏ ఒక్క కళాశాలలోనూ పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ కాలేదు. పాలిటెక్నిక్, ఐటీఐ, తదితర కోర్సుల వైపు విద్యార్థులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలనే లక్ష్యం సన్నగిల్లింది.మధ్యాహ్న భోజన హామీ అమలేదీ..ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిన ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచే భోజనం తీసుకువస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన 75 శాతం ప్రవేశాలు గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల నుంచి వచ్చినవే. ప్రభుత్వం దృష్టి సారించి మధ్యాహ్న భోజనం అమలు చేస్తే ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది అధ్యాపకులు విస్తృతంగా ప్రచారం చేసిన స్పందన కరువైంది.వెయ్యి మంది దాటని పరిస్థితి..జిల్లా వ్యాప్తంగా 7 ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. సాధారణ, ఒకేషనల్ కోర్సుల్లో బోధన సాగుతోంది. ఒక్కో గ్రూపులో 40 మందికి అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం ప్రథమ సంవత్సరంలో సాధారణ, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 982 మంది చేరారు. అందులో 555 మంది జనరల్ కోర్సులో, 427 మంది ఒకేషనల్‌లో చేరారు. ప్రభుత్వ అనుబంధ కళాశాలలు పెరగడంతో ప్రవేశాల సంఖ్య తగ్గినట్లు పలువురు విద్యావేత్తలు చెబుతున్నారు. జిల్లాలో పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేట్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కళాశాలల్లో అధ్యాపకులకు అనుగుణంగా ప్రవేశాలు లేకపోవడం గమనార్హం.గడువు ముగిసింది జితేందర్‌రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు జిల్లాలోని 7 కళాశాలల అధ్యాపక బృందాలు ఇంటింటా తిరిగి విస్తృత ప్రచారం చేశారు. పత్రికలలో ప్రకటనలు ఇచ్చాం. అయినా గతేడాదితో పోలిస్తే ప్రవేశాల్లో ఎలాంటి మార్పు లేదు. ఇంటర్ బోర్డు 2 సార్లు గడువు పెంచి అవకాశం కల్పించింది. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి.

# అక్రమాలే 'నాటుకున్నాయ్'!



## యజమాని స్మరణలో శునకం!



**నర్సింహులపేట, –నవభూమి:** అనారోగ్యంతో ఇటీవల ఇంటి యజమాని మృతిచెందగా ఆయన చిత్రపటం వద్ద దీనంగా కూర్చొని విశ్వాసం చాటుతున్న శునకం విస్మయానికి గురి చేస్తోంది.మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన తోట రాజయ్య ఎనిమిదేళ్ల కిందట శునకాన్ని తెచ్చుకొని బన్నీ పేరుతో ముద్దుగా పెంచుకుంటున్నారు. ఆయన అనారోగ్యంతో ఈ నెల 17న మృతిచెందారు. సందర్శకులు, బంధువులు, నివాళులర్పించేందుకని రాజయ్య చిత్రపటాన్ని ఇంటి ఆవరణలో ఏర్పాటు చేశారు. రాజయ్య చిత్ర పటం వద్ద ఐదు రోజులుగా బన్నీ ఇలా దీనంగా కూర్చొని ఉంటోంది. ఎవరైనా వెళ్లగొట్టేందుకు ప్రయత్నించినా కదలటం లేదు. యజమానిపై ఇంతటి విశ్వాసం చాటుతున్న కుక్కను చూసి అక్కడికి వచ్చిన వారంతా ఆశ్చర్యపోతున్నారు.

## ప్రభుత్వానికి మిల్లు యజమాని టోకరా

**కురవి, –నవభూమి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల శివారులోని నవ్య పారా బాయిల్డ్ రైస్ మిల్లు యజమాని రూ.8.36 కోట్ల విలువైన 34,274 క్వింటాళ్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించారు.రైస్ మిల్లులో శనివారం పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఈ విషయం వెలుగు చూసింది. 2022-23 సీజన్‌లో పౌర సరఫరాల శాఖ వివిధ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేసిన 53,560 క్వింటాళ్ళ ధాన్యాన్ని మిల్లుకు తరలించారు. ఆ ధాన్యాన్ని మరాడించి 36,420 క్వింటాళ్ళ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ మిల్లరు కేవలం 8,871 క్వింటాళ్లు బియ్యం మాత్రమే ప్రభుత్వానికి అప్పగించారు.ఇంకా మరాడించని 40,513 క్వింటాళ్ళ ధాన్యం నిల్వ ఉండాలి. ప్రస్తుతం కేవలం 6,238 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు చూపారు. మిల్లు నిర్వాహకుడు వివిధ కారణాలను చూపుతూ రూ.8.36 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించి ప్రభుత్వాన్ని మోసగించారని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ఎం.ప్రభాకర్ వెల్లడించారు. కురవి పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



# ఉపాధ్యాయుల సర్దుబాటుకు కసరత్తు!

**మానుకోట –నవభూమి:** పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది.జిల్లా విద్యాశాఖ ఈమేరకు మరోసారి కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే రెండు నెలలుగా జిల్లాలో పని సర్దుబాటుకు జిల్లా విద్యాశాఖ ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో తాజాగా ప్రభుత్వం నుంచి వెలువడిన విధివిధానాల ప్రకారం సవరణలతో శనివారం ఈ ప్రక్రియను ప్రారంభించారు.జిల్లాలో ఈ సంవత్సరం జూన్, జులైలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను రెండు దఫాలుగా నిర్వహించారు. ఎస్జీటీ తత్సమాన కేడర్‌కు పదోన్నతులను నిర్వహించగా 521 మందికి పదోన్నతులు వచ్చాయి. ఎస్జీటీ, తత్సమాన ఉపాధ్యాయులు 884 మంది బదిలీ అయ్యారు. కొద్ది నెలల క్రితం 45 మంది ప్రధానోపాధ్యాయులు, 399 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో జిల్లాలో ఇంకా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అలాగే ఉంది. ప్రభుత్వం ఈ ఖాళీల్లో విద్యావాలంటీర్లను నియమించలేదు. జిల్లాలో వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం డీఎస్సీ-2024 పరీక్షల నిర్వహణ ప్రక్రియ ఇటీవల ముగిసింది. ఆ పరీక్ష ఫలితాలు రావడం, నియామకాల ప్రక్రియ పూర్తి కావడానికి ఇంకా సమయం పట్టొచ్చు. ఫలితంగా ప్రధానంగా ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల బోధనపై ఈ ప్రభావం పడనుండటంతో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ అనివార్యమైంది. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రానప్పటికీ రాష్ట్రంలో కొన్ని జిల్లాల విద్యాశాఖాధికారులు సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. జిల్లాలోనూ గత సంవత్సరంలో అనుసరించిన మాదిరిగానే ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియకు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించేందుకు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతో మండలాల వారీగా సమన్వయ సమావేశాలను మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశాల ద్వారా ఏ పాఠశాలలకు సర్దుబాటు చేయాల వివరాలను సేకరించారు. వీటిని మండల విద్యాశాఖాధికారులు జిల్లా విద్యాశాఖకు సమర్పించారు. ఇంతలోనే రాష్ట్ర విద్యాశాఖ నుంచి మార్గదర్శకాలు రావడంతో వాటిని అనుసరించి ఈ ప్రక్రియను నిర్వహించాల్సి వస్తోంది.సవరణలతో ప్రతిపాదనలు..వి.రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖాధికారి రాష్ట్ర పాఠశాల విద్యశాఖ నుంచి పని సర్దుబాటుకు సంబంధించి మార్గదర్శకాలు వెలువడ్డాయి. ఈ ప్రతులను జిల్లాలోని మండల విద్యాశాఖాధికారులకు వెంటనే పంపించాం. ఈ విధివిధానాల మేరకు గతంలో పంపిన పని సర్దుబాటు ప్రతిపాదనల్లో కొన్ని మార్పులు



చేయాల్సి ఉంటుంది. తాజా ఆదేశాల్లోని నియమ నిబంధనలకు పాటిస్తూ ప్రతిపాదనలను సరిచేసి శనివారమే పంపించాలని కోరాం. ఆ ప్రతిపాదనలను అందుకున్నాక తదుపరి చర్యలు చేపడతాం.

# అక్రమాలే 'నాటుకున్నాయ్'!

**భూపాలపల్లి –నవభూమి:** మొక్కల పేరిట నిధులు కాజేసే పన్నాగం కొత్తపల్లి ప్లాంటేషన్‌లో ఇటీవల నాటిన మొక్కలు భూపాలపల్లి అటవీ రేంజి పరిధిలోని కొత్తపల్లి అటవీ సెక్షన్‌లో అటవీ అధికారులు 60 హెక్టార్లలో హడావుడిగా మొక్కలు నాటడంలో ఆంతర్యం ఏమిటోనని తోటి సీనియర్ అటవీ ఉద్యోగులే కొందరు ప్రశ్నిస్తున్నారు.దీనివెనుక పెద్ద మొత్తంలో అటవీ శాఖ నిధులు కాజేసే యత్నం జరుగుతోందని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.భూపాలపల్లి అటవీ రేంజి పరిధిలోని కొత్తపెల్లి అటవీ సెక్షన్‌లో రుద్రారం గ్రామ సమీపంలో 'గ్రీన్ క్రెడిట్ ప్లాంటేషన్' పేరుతో కేంద్ర ప్రభుత్వ నిధులతో 60 హెక్టార్లలో మొక్కల పెంపకం చేపట్టారు. నిబంధనల ప్రకారం సహజంగా ఉన్న అడవుల్లో తక్కువ మొత్తంలో ఉన్న పెద్దపెద్ద చెట్లతో పాటు ముళ్లపొదలను తొలగించి, మార్చి, ఏప్రిల్‌లో భూమి చదును పనులు చేసి.. జూన్, జులై నెలల్లో చదును చేసిన అటవీ భూముల్లో మొక్కలు నాటాలి. కానీ, ఇక్కడ జరిగింది ఏంటంటే..? జులైలో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో ఆగమేఘాలపై ఓవైపు వర్షాలు పడుతుంటే చెట్ల తొలగింపు, భూమి చదను పనులు చేపట్టారు. ప్లాంటేషన్ పనుల్లో నాణ్యత లోపంతో పాటు అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. మొక్క నాటేందుకు అడుగు(ఫీట్) లోతు, అడుగు వెడల్పు గుంత తీసి, అందులో ఎరువు, గుళికలు వేయాలి. కానీ, తక్కువ లోతులోనే మొక్కలు నాటి.. ఎరువు, గుళికలు వేయకపోవడంతో చాలా మొక్కలు ఎండిపోయాయి.వలస కూలీలతోనే..ఏదైనా అటవీ అభివృద్ధి పనులు చేపట్టాలంటే సంబంధిత అటవీ గ్రామాలకు చెందిన కూలీలనే వాడుకోవాలి. కానీ, ఈ ప్లాంటేషన్‌లో వలస కూలీలతోనే మొత్తం పనులు పూర్తి చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో కూలీల కొరత ఉంటే అదనంగా 20 శాతం పెంచి, కూలీ చెల్లించాలి. కానీ రుద్రారం గ్రామం మల్హర్ మండలంలో ఉంటుంది. ఈ ప్రాంతంలో గతంలో సీసీఎఫ్ వినోద్‌కుమార్ మొక్కలు నాటిన కూలీలకు అదనంగా 13 శాతం మాత్రమే చెల్లించడానికి అనుమతిచ్చారు. ప్రస్తుతం 20 శాతం అదనపు బిల్లుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.గతేడాది కంపా నిధులతో పెంచిన అటవీ శాఖ నర్సరీలు కమలాపూర్, బోర్లగూడెం, కాటారం, మహదేవపూర్‌లలో మిగిలిపోయిన మొక్కలు తెచ్చారు. అదేవిధంగా సింగరేణి నర్సరీలో కొన్ని మొక్కలు తెచ్చి నాటారు. మిగతా మొక్కలు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో అర మీటరు పొడవు లేనివి కొనుగోలు చేశారు.ఒక మొక్క రూ.33 ధర చొప్పున బిల్లులు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. ఈ 60 హెక్టార్ల ప్లాంటేషన్‌లో సుమారు లక్ష మొక్కలు నాటినట్లు తెలిసింది.సపోర్టు కోసం వినియోగించే రెండు మీటర్ల పొడవు గల కర్ర కోసం వెదురు కలప అక్రమ రవాణా చేసిన విషయంలో ములుగు జిల్లా పస్రా అటవీ రేంజీలో ఇద్దరు అటవీ ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురయ్యారు. డీసీఎం వ్యాన్‌లో రెండు ట్రిప్పుల వరకు 60 వేల సపోర్టు కర్రలు ఇదే నర్సరీకి తెచ్చారు. మిగతా 40 వేల వరకు సపోర్టు కర్రలు తీసుకొస్తున్న క్రమంలోనే ములుగు జిల్లా అటవీ అధికారులు పట్టుకున్నారు.ఒక కర్రకు ప్రభుత్వం రూ.14.50 చొప్పున చెల్లిస్తోంది. అయితే రూ.4 చొప్పున తక్కువ ధరకు ఇతర అటవీ రేంజి పరిధిలో నుంచి వెదురు కలప తీసుకురావడానికే ఈ అక్రమ వ్యవహారం జరిగినట్లు తెలిసింది. కలపను పస్రా అటవీ రేంజి అధికారులు పట్టుకుంటే రూ.26 వేల వరకు జరిమానా(సీ ఫీజు) చెల్లించినట్లు సమాచారం. ఇదే విషయంపై ఇటీవల కొందరు రాష్ట్ర అటవీ విజిలెన్స్ అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అటవీ శాఖ ఉన్నతాధికారులు ప్లాంటేషన్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మరింత అవినీతి వెలుగులోకి రానుంది.ఇంత వరకు బిల్లు చెల్లించలేదు వసంత, డీఎఫ్‌వో, భూపాలపల్లి కొత్తపల్లి ప్లాంటేషన్‌లో 60 హెక్టార్లలో మొక్కలు నాటిన విషయం నిజమే.. అయితే ఇంతవరకు పైసా కూడా బిల్లు చెల్లించలేదు. ఈ ప్లాంటేషన్‌లో కొందరు అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఏదైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బిల్లులు చెల్లిస్తాం. ప్లాంటేషన్‌లో మొక్కలు పెంచాలంటే వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయినా, విచారించి చర్యలు తీసుకుంటాం.



## పండుగ కానుక అందేనా..



**భూపాలపల్లి, –నవభూమి:** ఈ ఏడాది పేద మహిళలకు బతుకమ్మ పండుగ చీరల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. గత ఏడేళ్లుగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా చీరలను పంపిణీ చేస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ పండుగకు చీరల పంపిణీపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన బతుకమ్మ చీరల పథకం ఏడు సంవత్సరాల పాటు నిరాటంకంగా కొనసాగింది. కొవిడ్ సమయంలోనూ ఈ సంప్రదాయాన్ని ఆపలేదు. కానీ, ఈ ఏడాది తయారీదారులకు ఆర్డర్లు ఇవ్వకపోవడం.. బతుకమ్మ పండుగ ఇంకా కొద్ది రోజు లు మాత్రమే ఉన్నప్పటికీ చీరల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లను ప్రారంభించక పోవడంతో ఈసారి లేనట్టేనని అధికారులు అంటున్నారు. ప్రతీ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ఒక కోటి చీరలను 250 రకాల డిజైన్‌లలో, 10కిపైగా ఆకర్షణీయమైన రంగుల్లో మహిళలకు పంపిణీ చేసేవారు. ఈ ఏడాది మాత్రం ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం వల్ల పేద మహిళలు ఉచితంగా చీరల నందుకోవడమే కాకుండా, నేత కార్మికులు, కార్మికులు, వాహనదారులు కూడా ఆర్థికంగా లబ్ధి పొందేవారు. ఈ పథకం ఆపివేయడం వల్ల ఆయా వర్గాలు ప్రభావితమయ్యే పరిస్థితి ఉత్పన్నమైంది. 2017 నుంచి ఏటా ప్రభుత్వం సుమారు రూ. 330 కోట్ల నుంచి రూ. 350 కోట్ల వరకు బడ్జెట్‌తో సుమారు ఒక కోటి చీరల కో సం ఆర్డర్లు ఇచ్చేది. అందులో 90 శాతం సిరిసిల్లలో తయారు చేయించేవారు, మిగతావి కరీంనగర్, వరంగల్‌లో తయారయ్యాయి. ఈ చీరల పంపిణీని రంజాన్, క్రిస్మస్ పండుగలకు కూడా కొనసాగించారు. గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వం 250 డిజైన్‌లలో 1.02 కోట్ల చీరలు పంపిణీ కేంద్రాలకు పంపింది. ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో పంపిణీని నిలిపివేశారు. అవి ఇప్పటికీ అలాగే ఉన్నాయని చెబుతున్నారు. అయితే స్వశక్తి సంఘాల మహిళలకు కోటి 30 లక్షల చీరలు పంపిణీ చేసేందుకు త్వరలో ఆర్డర్ ఇవ్వబోతున్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల స్వయం శక్తి సంఘాల మహిళలు ఉన్నారని, గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరల నాణ్యత సరిగ్గా లేకపోవడం వల్ల ఆ చీరలు ఎందుకు పనికిరాకుండా పోయాయని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, ఈ చీరల పంపిణీపై నేత కార్మికులు, ఇతర వర్గాల భవిష్యత్తు కూడా ఆధారపడి ఉన్నందున అన్నీ బేరీజు వేసుకొని ఒక్కో మహిళకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ఇప్పటికిప్పుడు ఆర్డర్ ఇచ్చినాఆ చీరలు తయారు కావడానికి కనీసం నాలుగు నెలల సమయం పడుతుందని, ఈ నిర్ణయం ఏప్రిల్, మే మాసాల్లో తీసుకొని ఉంటే బతుకమ్మ పండుగకు చీరలు అందేవని నేత కార్మిక వర్గాలు చెబుతున్నాయి. బతుకమ్మ చీరల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బేషజాలకు పోవడం వల్లే ఈ పరిస్థితి ఉత్పన్నమైందని అంటున్నారు. జిల్లాలో 1.14లక్షల మంది అర్హులు భూపాలపల్లి జిల్లాలో ఈ ఏడాది బతుకమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడినప్పటికీ త్వరలో ఒక కోటి 30లక్షల చీరలు పంపిణీ చేయబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దరిమిలా జిల్లాలో ఉన్న తెల్ల రేషన్ కార్డుదారులందరూ చీరలు ఉచితంగా పొందేందుకు అర్హులుగా గుర్తించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ లెక్కన భూపాలపల్లి జిల్లాలో మొత్తం 1.14లక్షల మంది అర్హులు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో అత్యధికంగా భూపాలపల్లిలో 19,401 మంది, అత్యల్పంగా పలిమెల మండలంలో 2,087 మంది లబ్ధిదారులు ఉన్నారు. అయితే స్వశక్తి సంఘాల మహిళలని ప్రామాణికంగా తీసుకుంటే మాత్రం లబ్ధిదారుల సంఖ్య మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

## కౌన్సిల్ సమావేశం వేళ..
## తాయిలాల ఎర..!

**కార్పొరేషన్,్ –నవభూమి:** వరంగల్ మహా నగరపాలక సంస్థ పాలకవర్గం పదవీకాలం దగ్గర పడుతుండటంతో ఈ నెల 24న జరిగే కౌన్సిల్ సమావేశంలో తమకు అనుకూల నిర్ణయాలు తీసుకునేందుకు పార్టీలకతీతంగా ఒక్కటవుతున్నారు. అసంతృప్తితో రగలిపోతున్న కార్పొరేటర్లను మచ్చిక చేసుకునేందుకు పాలకవర్గం పెద్దలు తాయిలాల ఎర వేస్తున్నారు. అడిగిన వెంటనే డివిజన్లకు నిధుల కేటాయింపు, నామినేషన్ పనులు, పైరవీలు, అధ్యయనం పేరుతో విహార యాత్రకు తీసుకెళ్లాలని ప్రతిపాదించారు.

### ఆత్మస్థైర్యమే ఔషధం..
# మహమ్మారిపై విజయం




**ఎంజీఎం ఆసుపత్రి, –నవభూమి:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతుండడంతో వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మహమ్మారి బారిన పడుతున్న వారిలో మహిళలే అధికంగా ఉంటున్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు అధునాతన పరీక్ష విధానాలు అందుబాటులోకి రావడం, హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లకుండా వరంగల్‌లోనే నిర్ధారణ, చికిత్సలు ఉండడంతో చాలా మంది ఈ వ్యాధి నుంచి బయటపడుతున్నారు. క్యాన్సర్ వచ్చిందని నిరాశతో కుంగిపోకుండా.. చెక్కు చెదరని ఆత్మస్థైర్యంతో.. కొండంత ఆశతో దీన్ని ఎదుర్కొంటున్నారు. నేడు జాతీయ క్యాన్సర్ సర్వైవర్స్‌డే సందర్భంగా.. ఈ మహమ్మారిని జయించిన ధీరులపై స్ఫూర్తిదాయక కథనమిది. ఎంజీఎంలో సేవలు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని క్యాన్సర్ ఓపీ విభాగానికి ప్రతిరోజూ 20 నుంచి 25 మంది కొత్త రోగులు వస్తుండగా.. 60 మంది వరకు పాత రోజులు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలోని 15 పడకల ప్రత్యేక క్యాన్సర్ వార్డులో దీర్ఘకాలిక రోగులను చేర్చుకొని చికిత్స అందిస్తున్నారు. స్వల్ప కాలిక చికిత్స ఏరోజుకారోజు, చివరిదశలో ఉన్న వారికి 10 పడకల పాలియేట్కేర్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. గుండె నిబ్బరంతో జయించా మొలుగూరి భిక్షపతి, పరకాల మాజీ ఎమ్మెల్యే నేను 2016లో వెన్నెముక సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు వెళ్లగా క్యాన్సర్ వచ్చినట్లు తెలిసింది. వ్యాధి రెండోదశలో ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. రాజధానిలోని మరో ఆసుపత్రిలో 8 ఏళ్ల నుంచి చికిత్స తీసుకుంటున్నా. ప్రతి ఆర్నెల్లకో సారి అన్ని రకాల పరీక్షలు చేయించుకుంటున్నా. వైద్య ఖర్చులకు ప్రభుత్వం రూ. 40 లక్షలు ఇవ్వగా.. మరో రూ. 20 లక్షలు సొంత ఖర్చులయ్యాయి. డైట్ పాటిస్తూ నిత్యం వ్యాయామం చేస్తున్నా. కుటుంబ సభ్యుల సహకారం, గుండె నిబ్బరంతో క్యాన్సర్‌ను జయించాను. క్యాన్సర్ వచ్చిందని ఎవరూ భయపడొద్దు. నిర్లక్ష్యం చేయకుండా రెండోదశలోనే గుర్తిస్తే బయటపడొచ్చు. వైద్య పరీక్షలు చేయించుకుంటూ వైద్యులు సలహాలు పాటించాలి. వారి సూచనల ప్రకారం మందులు వాడితే దీని నుంచి బయటపడొచ్చు. మనోధైర్యమే బయటపడేలా చేసింది నాపేరు సాంబలక్ష్మి (56), మాది వరంగల్ కాశీబుగ్గ. నేను ఇళ్లలో పని చేసేదాన్ని, నాకు గతేడాది మే నెలలో రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఎంజీఎంలోని క్యాన్సర్ విభాగం వైద్యులు శస్త్రచికిత్స చేశారు. మనోధైర్యంతో వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్నాను. ఉచితంగా మందులు ఇస్తున్నారు. నాకు ముగ్గురు పిల్లలు ఉండగా అందరికీ పెళ్లిళ్లు చేశాను. నా బిడ్డలే నన్ను పోషిస్తున్నారు. వ్యాధి తగ్గడంతో నా బిడ్డలు, మనవరాళ్లతో కలిసి సంతోషంగా ఉన్నాను. వ్యాధి తగ్గింది.. సంతోషంగా ఉన్నా నాపేరు మనోహర(38), దేశాయిపేటలోని ఎంహెచ్ నగర్‌లో ఉంటున్నా. బీడీల పని చేసేదాన్ని 2019లో రొమ్ము క్యాన్సర్ వచ్చింది. ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నా. ఖరీదైన మందులు కొనే స్థోమత లేక 2020 నుంచి ఎంజీఎం ఆసుపత్రిలోని క్యాన్సర్ విభాగంలో చూపించుకుంటున్నా. ఇక్కడ వైద్యులు బాగా చూస్తున్నారు. మందులు ఉచితంగా అందించారు. ప్రస్తుతం వ్యాధి తగ్గడంతో సంతోషంగా ఉన్నాను. ప్రాథమిక దశలో చికిత్సతో బయటపడొచ్చు డాక్టర్ సంగీతకుమారి, క్యాన్సర్ విభాగాధిపతి, ఎంజీఎం ఆసుపత్రి క్యాన్సర్ అని అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. నిర్ధారణ అయిన వెంటనే చికిత్స తీసుకున్న చాలా మంది జబ్బు నుంచి బయటపడుతున్నారు. ఎంజీఎం ఆసుపత్రిలో ప్రస్తుతం అధునాతన చికిత్స అందుబాటులో ఉంది. నిపుణులైన వైద్యులున్నారు. మా వద్దకు వచ్చిన వారిలో చాలా మంది కోలుకుంటున్నారు.

# నిగ్గు తేలేనా..!

**లింగాలఘణపురం –నవభూమి:** గత కొన్నేళ్లుగా చెరువులు, కుంట శిఖాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చెరువు శిఖాల్లో వెంచర్ల పేరిట అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా కూడా అధికారులు అటువైపుగా కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటుగా సూర్యాపేట రోడ్డు, హన్మకొండ రోడ్డు, హైదరాబాద్ రోడ్డు, సిద్దిపేట రహదారులకు ఆనుకుని ఉన్న శివారు ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు దర్జాగా కబ్జాకు గురవుతున్నప్పటికీ అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఒకవేళ ఎక్కడైనా కబ్జాకు గురైనట్లుగా అధికారులకు ఎవరైనా ఫిర్యాదు చేసినా అలాంటి ఫిర్యాదులను బుట్టదాఖలు చేయడం తప్ప చర్యలు తీసుకోవడంలో ఆసక్తి చూపడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి వాటిని నియంత్రించేందుకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేసి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఇదే సరైన తరుణమని జిల్లా ప్రజలు భావిస్తున్నారు. జోరుగా కొనసాగుతున్న అక్రమణల పరంపర గత పదేళు ్లగా రియల్‌ఎస్టేట్ భూమ్ ఊపందుకో వడంతో రియల్ వ్యాపారులు, బడాపారిశ్రామిక వేత్తలు జనగామ జిల్లా కేంద్రానికి చుట్టూ పరిసర గ్రామాల్లో వేలాది ఎకరాల భూములను కొనుగోలు చేసి వెంచర్ల పేరిట భూవ్యాపారాలు చేస్తున్నారు. అయితే పనిలో పనిగా కొందరు సందు దొరికినప్పుడల్లా చెరువు శిఖాలు, కుంటశిఖాలను తమ స్వాధీనంలోకి అక్రమంగా తెచ్చుకుంటున్నట్లు



ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే వాటికి ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేశాకే ఆక్రమణలు నిజమా.. కాదా..? అనే విషయాలు నిగ్గుతేలుతాయని అధికారులు ప్రజల విజ్ఞప్తులను పరిశీలించకుండా తాత్సారం చేస్తున్నారు. హద్దుల ఏర్పాటుకు అనుకూల తరుణం రెండు మాసాలుగా జిల్లా వ్యాప్తంగా విస్తారమైన వర్షాలతో చెరువులు, కుంటలు చాలాచోట్ల నిండుకం డను తలపిస్తున్నాయి. అయితే ఇప్పటికే చెరువు శిఖాలు, కుంట శిఖాల ఆక్రమణలతో పాటుగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నా యి. ప్రస్తుతం నిండు కుండలను తలపిస్తున్న నీటివనరులకు ఫుల్‌ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్) హద్దులను ఏర్పాటు చేయడానికి అనువైన తరుణమని సూచిస్తున్నారు.